కథ

# చేజారిన స్వర్గం

## భీమరాజు వెంకట రమణ

**"నలభై అయిదేగా! ఏం వయసు అయిందని?" అని బంధుజనం అనడం వల్లనో, ఉప్పూ కారం తింటున్నావుగా! అని మనసు ప్రలోభపెట్టడం వల్లనో కక్కుర్తిపడి రెండో పెళ్ళి చేసుకున్న శంకరరావుకి చెంపలు వేసుకునే సమయం రానే వచ్చింది. ఎందుకంటే శంకరరావు తనకు తగినవాడు కాదని ఇంతకాలానికి అనిపించడంవల్లనో! లేక "నీకూ మీ ఆయనకు వయసులో చాలా తేడా ఉన్నదే!" అని అమ్మలక్కలు అదేపనిగా అనడం వల్లనో దుర్గమ్మలో క్రమేపీ కొన్ని మార్పులు వచ్చి, చివరికి ఉద్ధృత స్వభావంలో ఆమె స్థిరపడింది. ఆమెదే ఇంట్లో పైచేయి కావడమే కాదు తనపై కూడా చెయ్యి చేసుకునే రోజులు త్వరలో రాబోతున్నట్లు కూడా శంకరరావుకి అప్పుడప్పుడు అనిపిస్తున్నది.**

అటు ఆఫీసులో లెక్కలు సరిగా టాలీ కావడంలేదని, కంప్యూటర్ ద్వారా లెక్కలు చేయడం నేర్చుకోమని వత్తిడి చేస్తున్న కుర్ర యజమాని, ఇటు ఇంట్లో వీలైనప్పుడల్లా రోజుకో విషయంలో క్లాసు తీసుకునే భార్యామణి. ఇద్దరిమధ్య నలుగుతున్న శంకరరావు ఎన్నోసార్లు పార్కుల్లో శూన్యంలోకి చూస్తూ కూర్చోవడం, విచక్షణ లేకుండా కనపడిన సినిమా హాల్లోకి వెళ్లి ఏదో ఒక సినిమా చూస్తూ మూడు గంటలు గడిపిరావడం లాంటివి చేసేవాడు.

ఆ రోజు ఆఫీసు నుండి బయటకు వచ్చిన శంకరరావు ఎప్పటిలాగే ఇంటి విషయాలు ఆలోచిస్తూ నడుస్తున్నాడు. "ఒక్కగానొక్క కూతురు సుమతి, మంచి సంబంధం కూడా సిద్ధంగా ఉంది, పడనిస్తుందో లేదో గయ్యాళి! మరీ ఈ మధ్య పెడసరంగా తయారయింది. వద్దన్నపని చేస్తుంది, చెయ్యమన్న పని అసలు చెయ్యదు, ఎడ్డెం అంటే తెడ్డెం అంటుంది. బంధువులు ఎవరైనా వస్తే ఒక పూటకు మించి ఉండే ధైర్యం ఎవరికీ లేకుండా పోయింది! ఎలా! ఈ సమస్యకి పరిష్కారం?"

"ఏ రోజుకి ఆ రోజు ఆఫీసు నుండి వచ్చి ఇంట్లో అడుగు పెడుతూ మళ్ళీ రేపు సజావుగా బయట అడుగు పెడతానా అని అనుమానం, గని కార్మికుని జీవితం నాదీ ఒకటే, అతనికి గనిలో, నాకు ఇంట్లో హెచ్చరిస్తుంటుంది ప్రమాదం" అనుకుంటూ ఇంటికి చేరిన శంకరరావు లోపలికి అడుగు పెట్టాడు. ఎదురుగా నట్టింట్లో నిలబడి ఉన్న భార్య దుర్గమ్మని చూస్తూ ఊహల్లోకి వెళ్ళిపోయాడు.

ఆమెకు అటూ ఇటూ నాలుగు తలలు ఉన్నట్లూ ఆమె ఇంటి సీలింగ్ ఎత్తు ఎదిగినట్టు, తనేమో రెండేళ్ళ పిల్లవాడిలాగ కింద ఎక్కడో నిలబడి తలపైకెత్తి చూస్తున్నట్లు అనిపిస్తుంది. పక్క పోర్షన్ నుండి జియోగ్రాఫికల్ చానల్ నుండి వస్తున్న ఏనుగులు, సింహాల అరుపులు ఆ సన్నివేశానికి మరింత సహజత్వాన్ని చేకూర్చాయి, విశ్వరూపాన్ని చూస్తున్న స్థితిలో కాసేపు ఉండిపోయాడు శంకరరావు.


తల విదిలించుకొని, తమాయించుకొని మెల్లగా తన గదిలోకి వెళ్ళాడు. మంచినీళ్ళు తెచ్చిచ్చిన కూతురు సుమతితో "కాలేజికి వెళ్ళొచ్చావా తల్లీ?" అడిగాడు. ఆమె వెళ్ళొచ్చానన్నట్లు తలూపి లోపలికి వెళ్లింది. స్నానం చేసి కాసేపు ఆరుబయట కూర్చున్న శంకరరావు ఆకలేస్తుంటే, ధైర్యం చేసి భార్యతో "ఈ పూట వంటేమి చేశావు దుర్గా?" అని అడిగాడు.

అప్పటిదాకా పడక్కుర్చీలో వీక్లీ చదువుతూ కూర్చున్న దుర్గమ్మ గయ్‌మన్నది. "తమరు ఆఫీసుకి, ఈ రాణిగారు కాలేజీకి పోయివచ్చేసరికి విందుభోజనాలు ఏర్పాటు చెయ్యటానికి ఇక్కడ ఎవరూ సిద్ధంగా లేరు. నాకు ఈ పూట ఓపిక లేదు, మాగాయ పచ్చడి, మజ్జిగ ఉన్నాయి. తండ్రీ కూతుళ్ళు పెట్టుకొని మెక్కండి" అన్నది విసుగ్గా. ఆ పదజాలం శంకరరావుకేమీ కొత్తకాదు. ఉన్నదేదో తిని బడిలికతో మంచం మీద వాలాడు.

రాత్రి రెండు గంటలు దాటింది. "వద్దు! నన్నేమీ చెయ్యొద్దు! అని కేకలు పెడుతున్న శంకరరావుని ప్రక్కనే చాపమీద పడుకొని ఉన్న కూతురు తట్టి లేపి "ఏమైంది నాన్నా?" అని అడిగింది. "మీ పిన్ని కలలోకి వచ్చిందమ్మా! నన్ను చంపుతుందేమో భయమేసింది!" అన్నాడు చెమటలు తుడుచుకుంటూ.

"ఈ మధ్య నీవు ఏదోలా అయిపోతున్నావు నాన్న! పిన్ని సంగతి తెలిసిందేగా? ఇదిగో ఈ మంచినీళ్ళు తాగు" అని గ్లాసు చేతికిచ్చింది. నీళ్ళు తాగి కాస్త తేరుకుని కూతురు తలమీద చెయ్యి వేసి నిమురుతూ "ఎలాగైనా త్వరలోనే నీ పెళ్ళి చెయ్యాలమ్మా, ఏదో ఒకటి ఆలోచించాలి, సరే! నువ్వెళ్ళి పడుకో తల్లి!" అంటూ తను కూడా నిద్రలోకి ఉపక్రమించాడు.

ఆ రోజు ఆదివారం ఆఫీసుకు సెలవు. నిద్రలేచిన శంకరరావు మంచంమీదనే కాసేపు కూర్చొని రాత్రి పీడ కల గుర్తుకు తెచ్చుకున్నాడు. "ఈ ఇంటి సమస్యకు ఏదో ఒక పరిష్కారం చూడాలి. ఎవరో చెప్పిన జ్యోతిష్యుడు గుర్తుకొచ్చాడు. ఆయన్నే ఒకసారి కలవాలి. మహాతల్లి ఇంకా నిద్ర లేచినట్లు లేదు.





ఆదివారమయినా కాస్త కూడా విశ్రాంతి తీసుకోనీయకుండా ఇంట్లో రకరకాల చాకిరీ చేయిస్తుంది" అనుకొని శంకరరావు క్షణాల్లో తయారయ్యి బయటపడ్డాడు.

జ్యోతిష్యుడి దగ్గర అప్పటికే జనం ఉన్నారు. వాళ్ళని చూసి నాలాంటి మందభాగ్యులు చాలామంది ఉన్నారే! అనుకున్నాడు. ఓ గంట తరువాత అవకాశం దొరికింది. వెళ్ళి ఆయన ఎదురుగా కూర్చొని తన జేబులోనించి తనది, తన భార్యది జాతక వివరాలు ఆయన చేతికి ఇచ్చాడు శంకరరావు.

జ్యోతిష్యుడు ఆ రెండు కాగితాలు కాసేపు కనుబొమ్మలు పైకి లేపి తీక్షణంగా చూసి శంకరరావు ముఖంలోకి అయ్యో పాపం అన్నట్లు చూస్తూ "ఇప్పుడు చెప్పండి మీ సమస్య" అన్నాడు గంభీరంగా. "ఏముందండీ ఇంట్లో సమస్యలు తారస్థాయికి చేరుకున్నాయి. బొత్తిగా మనశ్శాంతి లేదు. కుమార్తెకు పెళ్ళి చెయ్యాలి. మంచి సబంధం కూడా సిద్ధంగా ఉంది. డబ్బూ ఏర్పాటు చేస్తున్నాను. సవతితల్లి సఖ్యత లేదు. నా బిడ్డ పెళ్ళి చెయ్యకుండానే పోతానేమో అని నా భయం" అన్నాడు శంకరరావు.

"చూడండి ప్రస్తుతం మీదీ మీ ఆవిడది గ్రహస్థితి పరమనీచంగా ఉంది" అన్నాడు జ్యోతిష్యుడు. శంకరరావు కలగజేసుకుంటూ "అంటే రాహువు తొంగిచూడటం, కేతువు వక్రంగా చూడటంలాంటివా?" అడిగాడు. "చూడటమేమిటండీ! రాహువు కేతువు మీ ఎదురుగా తిష్ట వేస్కొని కూర్చున్నారు. శని నడుం మీద చేయి పెట్టుకొని వాళ్ళ వెనుకనే నిల్చుని ఉన్నాడు. "చూస్తున్నట్లుగా వివరిస్తూ" కాబట్టి ఖర్మ అనుభవించక తప్పదు. దేవుళ్ళే కష్టాలు అనుభవించి చూపారు. మానవమాత్రులం మనమెంత?" అన్నాడు జ్యోతిష్యుడు పెదవి విరుస్తూ.

శంకరరావుకి ఒళ్ళు మండింది. "అయితే మీరంతా ఎందుకండీ?, జ్యోతిష్య సామ్రాట్, జ్యోతిష్య శిఖామణి నా బొంద బోలే అని బిరుదులు పెట్టుకొని ఇట్లా మమ్మల్ని రప్పించి మా ప్రాణాలు తింటారు?" అంటూ ఊగిపోయాడు. "అయ్యయ్యో! ఆవేశపడకండి! మీ పరిస్థితి చూస్తే మీరెంత తీవ్రంగా బాధపడుతున్నారో అర్థమవుతున్నది. విరుగుడు లేదన్నాను గానీ ఉపశమనం లేదని చెప్పలేదుగా?, అందుకే మేమిక్కడ ఉన్నది" కనుబొమ్మలు పైకెగరేసాడు జ్యోతిష్యుడు.

శంకరరావుకి మళ్ళీ కాస్త ఆశ కలిగింది. "దయచేసి ఉపాయం చెప్పండి" అడిగాడు. అతను కాసేపు ఆలోచించి "దీనికి ఒకే ఒక మార్గం ఉంది. మీరు కాస్త లౌక్యం ప్రదర్శించగలిగితే మీ జీవితం ఆనందమయం అవుతుంది, స్వర్గంగా మారే అవకాశం కూడా లేకపోలేదు" అన్నాడు.

"చెప్పండి! నేనేం చేయాలో!" ఆత్రుతగా అడిగాడు శంకరరావు. "ఏమీ లేదు. మీ ఆవిడ మీరు చెప్పినదానికి వ్యతిరేకంగా చేస్తున్నదంటున్నారు కదా!, ఇకనుండి తెలివిగా మీకు కావల్సింది చెయ్యొద్దని చెప్పండి, చేస్తుంది. అంతే! ఈ చిట్కావల్ల తప్పక ఫలితం కలుగుతుందని నా నమ్మకం. అయితే చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి, ఎక్కడయినా తేడా వచ్చిందో కథ మొదటికి వస్తుంది" వివరించాడు జ్యోతిష్యుడు.

నమ్మకం కలగకపోయినా ఏదో ఆశ కలుగుతోంది శంకరరావుకి. ప్రయత్నించి చూస్తే పోలే అనుకొని జ్యోతిష్యుని దగ్గర సెలవు తీసుకొని బయటపడ్డాడు శంకరరావు.

ఇంటికొచ్చి కూతురికి ఈ విషయం వివరించి వెంటనే ఆచరణలో పెట్టడం ప్రారంభించాడు. భార్య వినేట్లు కూతుర్ని తిడుతూ "మీ అమ్మతోనే పోయిందే నీ అదృష్టం! నీ పెళ్ళి ఇప్పుడు చేయలేను, సంబంధం వచ్చినా నా వల్ల కాదు. నీ ఖర్మ ఎలా ఉంటే అలా జరుగుతుంది" అన్నాడు.

**శంకరరావుకి మతిపోయినంత పనయ్యింది. "ఏమిటి నేను వింటున్నది, ఇది కలా నిజమా, గాలిలో తేలుతున్నట్టు ఉంది. చిట్కా ఎంత పర్ఫెక్ట్‌గా పనిచేస్తున్నది". అంతలోనే జ్యోతిష్యుని మాటలు గుర్తుకొచ్చాయ్. తను ఆనందం ప్రదర్శిస్తే ప్రమాదం తప్పదు. "సరేలే నువ్వెప్పుడూ ఇంతే, నేను కాదన్నది నువ్వు అవునంటావు"**

దుర్గమ్మ బుల్లెట్‌లా దూసుకొచ్చింది. "ఏమిటయ్యా నువ్వు మాట్లేదేది? పెళ్ళీడుకొచ్చిన పిల్లను ఎంతకాలం ఇంట్లో పెట్టుకుంటావ్? సవతితల్లి పెళ్ళి చేయలేదని అందరూ నా మీద పడి ఏడవాలనా నీ ప్లాను? పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని వెంటనే సంబంధం గురించి ఆలోచించు" అంటూ లోపలికి వెళ్ళింది.

శంకరరావుకి మతిపోయినంత పనయ్యింది. "ఏమిటి నేను వింటున్నది, ఇది కలా నిజమా, గాలిలో తేలుతున్నట్టు ఉంది. చిట్కా ఎంత పర్ఫెక్ట్‌గా పనిచేస్తున్నది". అంతలోనే జ్యోతిష్యుని మాటలు గుర్తుకొచ్చాయ్. తను ఆనందం ప్రదర్శిస్తే ప్రమాదం తప్పదు. "సరేలే నువ్వెప్పుడూ ఇంతే, నేను కాదన్నది నువ్వు అవునంటావు" అంటూ "నాకు ఎందుకో ఎండకి ఆకలి లేదు, అన్నం వద్దు అలా బజారు వెళ్ళి వస్తాను" అన్నాడు శంకరరావు.

వెంటనే అందుకుంది దుర్గమ్మ. "ఏమిటి? అన్నం తినకుండా బజార్లు తిరిగేది? తరువాత నీరసాలు వస్తే ఎవరు చేస్తారు ఇక్కడ? పప్పు కూర చేస్తున్నా, మాట్లాడకుండా తిని ఇంట్లోనే ఉండు" అంటూ వంట గదిలోకి వెళ్ళింది. ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్తగా ఉంటూ తనకు కావల్సినవన్నీ చేయించుకుంటున్నాడు శంకరరావు.

పొద్దున్నే మళ్ళీ లౌక్యం మొదలుపెట్టాడు శంకరరావు. "అమ్మా సుమతి నాకు కాఫీ టిఫిన్‌లాంటివి ఏమీ వద్దమ్మా, కాస్త మజ్జిగ తెచ్చిపెట్టు. తాగి ఆఫీసుకి వెళ్తాను".

"పొద్దున్నే మజ్జిగేంటి. నీకేమన్నా మతి ఉందా లేదా, టిఫిన్ చేసి కాఫీ తాగి వెళ్ళు. ఓపిక లేక ఆ ఉద్యోగం ఊడగొట్టుకుంటే ఈ మాత్రం కూడా ఉండదు" సాగదీస్తూ అన్నది దుర్గమ్మ.

సరే తప్పేదేముంది అన్నట్లుగా మొహం పెట్టి చక్కగా టిపిన్ కాఫీ సేవించి బయట వరకు మెల్లగా నడచి వచ్చి, బయటకు రాగానే ఆనందం కట్టలు తెంచుకున్నట్టు విజిల్ వేస్తూ "ఏయ్ ఆటో ఇలా రా"



# ప్రేమకథాచిత్రంలో కరిష్మా

కరిష్మాకపూర్ వెండితెరపైకి తిరిగి రానున్నారు. వివాహం చేసుకోడంతోనే చాలామంది నటీమణులు నటనకు గుడ్‌బై చెప్పేసి భర్త, పిల్లలతో కాలక్షేపం చేస్తూ ఉండటం తెలిసిందే. కానీ ఇటీవలి కాలంలో ఒకరిద్దరు పిల్లలు కలిగిన తరువాత మరలా తిరిగి నటిస్తున్న తారలు పెరిగారు. కాజోల్, మాధురీదీక్షిత్‌ల సినీ పునఃప్రవేశాలే ఇందుకు మంచి ఉదాహరణలు. యశ్‌రాజ్ ప్రొడక్షన్స్ బేనర్‌పై నిర్మించే ఓ చిత్రానికి సంబంధించిన స్క్రిప్టును ఆదిత్య చోప్రా ఆమెకు వినిపించారు. ఈ సినిమా ఓ పరిణతి చెందిన ప్రేమ కథాచిత్రంగా భావిస్తున్నారు. పెళ్లయిన ఓ జంట మధ్య వైవాహిక సంబంధాల్లో వచ్చే పొరపొచ్చాల గురించిన కథే ఈ సినిమా అని కరిష్మా సన్నిహితులొకరు చెప్పారు. ఈ సినిమా కథానాయకునిగా షైనీ అహూజా నటించబోతున్నారు. ప్రిప్రొడక్షన్ పని ప్రారంభమయిందట. కరిష్మాకు ఎంతో ఇష్టమయిన డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ చిత్రానికి సంబంధించిన పనితో బిజీగా ఉన్నట్లు తెలిసింది. కరిష్మాకు అనుకూలంగా ఉండేందుకు ముంబాయిలోనే షూటింగ్ జరిగేలా నిర్మాత ఏర్పాటు చేస్తున్నారు.

---

అని ఎక్కి కూర్చొని "పోనియ్! లక్ష్మీ కా పూల్" అన్నాడు మ్యూజికల్‌గా. పాట కూడా మొదలుపెట్టాడు. "ఈ పగలు రేయిగా పండు వెన్నెలగా' అంటూ. ఆటోవాడు అద్దం సవరించుకొని శంకరరావుని చూస్తున్నాడు వింతగా. ఆఫీసుకి చేరేలోగా రెండు మూడు పాటలు పాడి ఆటోవాడికి అయిదు రూపాయలు చిల్లర వదిలేసి ఆఫీసులోకి వెళ్ళాడు.

శంకరరావుని చూడగానే కుర్ర యజమాని "హలో అంకుల్" అన్నాడు. "హాయ్" బదులిచ్చాడు శంకరరావు కాస్త ఊగుతూ. యజమాని ఈ వింత పోకడ అర్థంకాక నివ్వెరపోయి చూస్తున్నాడు. ఆరోజు పనంతా పాత కొత్త పాటలు విజిల్స్‌తో సాయంత్రానికి పూర్తిచేసి యజమానితో "అబ్బాయ్! ఇదిగో నిన్న మొన్న లెక్కలతో పాటు ఇవాళవి కూడా అన్నీ టాలీ అయ్యాయి చూసుకో! వెళ్తొస్తా" అంటూ బయటకు నడిచాడు, అతను నోరెళ్ళబెట్టి చూస్తుండగా.

ఆరోజు రాత్రికి పెళ్ళిచూపులకు తనకు నచ్చిన, రవీంద్ర అనే అబ్బాయి ఫోటోతో పాటూ తన ఆఫీసు ఫైల్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న ఎవరిదో అప్లికెంట్ ఫోటోనూ కలిపి తెచ్చి టీపాయ్ మీద పెట్టి, "అమ్మా సుమతి, దుర్గా! ఇలా రండి, ఇదిగో ఈ ఇద్దరిలో ఎవరిని రేపు పెళ్ళిచూపులకి పిలవాలి బాగా చూడండి. నాకయితే ఈ కుర్రాడు భేషుగ్గా ఉన్నాడు" అని ఆ అప్లికెంట్ ఫోటో చూపించాడు. వెంటనే దుర్గమ్మ రవీంద్ర ఫోటో పట్టుకొని "నాకితను బావున్నాడు. ఇతన్నే రమ్మనండి" అంటూ ఆర్డరు వేసి వెళ్ళింది.


పెళ్ళి సింపుల్‌గా చేద్దాం అని శంకరరావు అంటే, దుర్గమ్మ బాగా చేద్దాం అని, పెళ్ళివారికి మర్యాదలు పెద్దగా అవసరం లేదంటే మర్యాదలు చేయకపోవటం మా ఇంటా వంటా లేదనీ, నిశ్చితార్థం అవసరం లేదంటే, చేసి తీరాలని మొదలగు పంతాలతో పెళ్ళిరోజు వచ్చేసింది. పెళ్ళిలో ప్రతి విషయంలోనూ తండ్రి కూతుళ్ళు జాగ్రత్త పడుతూ పనులు సజావుగా సాగేట్టూ చూసుకుంటున్నారు.

పెళ్ళికి వంద మందిని పిలుద్దాం అంటే రెండు వందల మందిని పిలవటం, వంటవాడిని పెట్టి సింపుల్‌గా భోజనాలు పెడదాం అంటే, కాటరింగ్ పెట్టడం, భోజనాలలో ఒక స్వీట్ చాలంటే నాలుగయిదు చేయించటం, డెకరేషన్ అవసరం లేదంటే, లేకుంటే నేను పెళ్ళి పందిరిలోనే ఉండననటం, మొత్తానికి పెళ్ళి వైభవంగా జరిగి మర్యాదలకు, పెట్టుబడులకు పెళ్ళివారు తెగ సంతోషపడిపోయారు. శంకరరావు అమెరికా అధ్యక్షుడు దర్జా కనపరుస్తున్నాడు. నిజంగా స్వర్గం అతని కాళ్ళకింద వెళ్తున్నట్టు ఉంది. దేవేంద్రుడి పాత్ర పోషిస్తున్నట్టు ఉంది. జీవితంలో ఎప్పుడూ కలగని ఆనందం అనుభవిస్తున్నాడు.

సాయంత్రానికి అప్పగింతలు కూడా చక్కగా పూర్తయి శంకరరావు దుర్గమ్మ మిగిలారు ఇంట్లో. రివర్సుగా మాట్లాడి భార్యతో పని చేయించుకోవటం గొప్పగా ప్రాక్టీసు అయింది శంకరరావుకి. బాగా అలిసిపోయాను ఆకలి లేదు భోజనం వద్దన్నాడు. తిని తీరాల్సిందే అన్నది. నువ్వు తిను నేను తరువాత తింటాను అంటే, ఇద్దరం కలిసి ఇప్పుడే తినాలి అన్నది.

ఇద్దరూ కలిసి చాలాకాలం తరువాత భోజనం చేశారు. ఏది ఏమైనా కుమార్తె పెళ్ళి వైభవంగా జరిపించడానికి తోడ్పడినందుకు భార్యను మనసులో గొప్పగా అభినందించాడు.

శంకరరావుకి విజయంతో కూడిన ఆనందం లోపల తికమక పెడుతున్నది. వారెవా! జ్యోతిష్యుడా! వెయ్యేళ్ళు వర్ధిల్లు! అనుకుంటూ పడక్కుర్చీలో కూర్చొని కాళ్ళు ఊపుతూ, కాస్త హెచ్చు స్థాయి స్వరంతో "దుర్గా అక్కడ పెద్ద ఇత్తడి ప్లేట్‌లో తమలపాకులు, వక్కపొడి ఉండాలి, ఇటు పట్రా!" అన్నాడు పొరపాటున. అంతే! అదే ఇత్తడి ప్లేట్‌తో బట్టతలపైన ఫాట్‌మని ఒకటి ఇచ్చింది దుర్గమ్మ. •




"వ. ఆనంద్"

